మా కలం.. మీ గళం..

# మన గళం

RNI : APTEL/ 2017/74310

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 07 సంచిక : 346 శనివారం 03 - 05 - 2025 పేజీలు: 8 వెల: 4

## కిశోరి వికాసం ద్వారా బాలికల సర్వతో ముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



3

# కొత్త ఆంధ్రప్రదేశ్ రూపుదాల్చుతోంది

- ☐ అమరావతి స్వప్నం సాకారమవుతోంది
- ☐ అమరావతి పున:ప్రారంభ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన
- ☐ ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది
- ☐ అమరావతి పున:ప్రారంభ పనులలో ప్రధాని నరేంద్రమోదీ



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పున:ప్రారంభ పనులకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అమరావతిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ చాలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి అని మోదీ అన్నారు. తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ.."అమరావతి స్వప్నం సాకారమవుతోంది. చారిత్రక పరంపర, ప్రగతి రెండూ కలిపి పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. ఒక కొత్త అమరావతి, కొత్త ఆంధ్రప్రదేశ్ రూపుదాల్చుతోంది. దుర్గాభవానీ కొలువైన ఈ భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. బౌద్ధ వారసత్వం, ప్రగతి కలగలిపిన ప్రాంతం ఇది. ఇప్పుడు నేను ఈ పుణ్యభూమిపై నిలబడి ఉన్నాను." అని తన ప్రసంగంలో వెల్లడించారు. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి అని పేర్కొన్న ప్రధాని మోదీ.. "ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది. ఇవి శంకుస్థాపనలు కాదు.. ఏపీ ప్రగతికి, వికసిత్ భారత్‌కు నిదర్శనం. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. రికార్డు స్పీడ్‌లో అమరావతి నిర్మాణాలు కొనసాగేందుకు కేంద్రం సహకరిస్తుంది. ఏపీలోకి ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుంది. చంద్రబాబు.. నా టెక్నాలజీ వాడకం గురించి చెప్పారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు.. ఏపీ సీఎంగా చంద్రబాబు టెక్నాలజీ వాడకాన్ని నేను గమనించాను. చంద్రబాబును చూసి నేర్చుకొన్నా." ప్రధాని మోదీ అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతమన్న ప్రధాని మోదీ.. "రికార్డు స్పీడ్‌లో 2



### భారత్‌కు అమెరికా భారీగా
## సైనిక సహాయం

మన గళం, న్యూఢిల్లీ : పహల్గామ్ దాడి తర్వాత పాకిస్తాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తత మధ్య, భారత దేశం అమెరికా నుండి భారీగా సైనిక సహాయం పొందబోతోంది. భారతదేశానికి 131 మిలియన్ డాలర్ల విలువైన యుద్ధ పరికరాలు, లాజిస్టిక్స్ సరఫరా చేసే ప్రతిపాదనను అమెరికా 2

### డిగ్రీ అర్హతతో యూనియన్
## బ్యాంకులో కొలువులు




మన గళం డెస్క్ : ముంబయి ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న యూనియన్ బ్యాంక్.. దేశ వ్యాప్తంగా ఉన్న బ్రాంచుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఎవరైనా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నోటిఫికేషన్ కింద 2



### సోనియా, రాహుల్‌కు
## కోర్టు నోటీసులు

మన గళం, న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈడీ దాఖలు చేసిన కేసులో వీరిద్దరికీ కోర్టు ఈ నోటీసులు పంపింది. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీటుకు రిప్లై ఇవ్వాలని వారిద్దరికి కోర్టు జారీ చేసిన నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ 2

### భక్తుల అభిప్రాయాల
## వాట్సాప్ ఫీడ్‌బ్యాక్



**భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ఓ కొత్త ఫీడ్‌బ్యాక్**

మన గళం, తిరుమల : భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ఓ కొత్త ఫీడ్‌బ్యాక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇకపై భక్తులు తమ అభిప్రాయాన్ని వాట్సాప్ ద్వారా సులభంగా తెలియజేసేందుకు తిరుమల, తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ 2

### ఏపీ ప్రభుత్వానికి
## సుప్రీం నోటీసులు

**కసిరెడ్డి పిటిషన్‌పై విచారణ.. సర్కార్‌కు సుప్రీం నోటీసులు**



మన గళం, న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి వేసిన పిటిషన్‌పై ఏపీ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. మద్యం కుంభకోణం కేసులో తనకు సీఆర్పీసీ 160 నోటీస్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును కసిరెడ్డి ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈరోజు (శుక్రవారం) సుప్రీం ముందుకు విచారణకు రాగా.. జస్టిస్ జేబీ పార్థివాల , జస్టిస్ మహదేవన్ ధర్మాసనం విచారించింది. తెలంగాణలో నివసిస్తున్న తనకు ఏపీ సీఐడీ పోలీసులు నోటీసులు ఇచ్చే పరిధి లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజ్ కసిరెడ్డి తరపున న్యాయవాది శ్రీహర్ష వాదనలు వినిపించారు. విచారణ జరిపిన కోర్టు రాజ్ కసిరెడ్డి పిటిషన్‌పై ఏపీ 2

### కరడుకట్టిన
## ఉగ్రవాదులు



మన గళం, న్యూఢిల్లీ : జమ్మూ కశ్మీర్‌లో పహల్గాం ఉగ్ర దాడి కారణంగా 26 మంది మరణించడంతో ఉగ్రవాదుల ఏరివేతకు భారత్ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఆ క్రమంలో ఉగ్రవాదుల కోసం సైనిక, భద్రతా దళాలు తమ 2





### పీవోకేకు అలర్ట్ ఆహారాన్ని
## నిల్వ చేసుకోవాలి

**పీవోకేలో ఆహార నిల్వలకు సూచన**

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో, ముఖ్యంగా వాస్తవాధీన రేఖ (ఎల్వోసీ) వెంబడి నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆహార నిల్వలను సిద్ధం చేసుకోవాలని 2

### అమరావతి కేవలం
## నగరం కాదు



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారంతో అమరావతిని ప్రపంచం గర్వించేలా నిర్మిస్తామని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా 2



### ధర్మ యుద్ధంలో గెలిచిన
## అమరావతి రైతులు

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం త్యాగం చేసిన అమరావతి రైతులు ఐదేళ్లలో నలిగిపోయారు, రాజధాని లేదన్న నేతలపై పోరాడి గెలిచారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని పవన్ మాటిచ్చారు. లాఠీదెబ్బలు, 2

# భారత్‌కు అమెరికా భారీగా సైనిక సహాయం

మొదటిపేజీ తరువాయి డొనాల్డ్ ట్రంప్ సర్కార్ ఆమోదించింది. పెంటగాన్ కింద పనిచేస్తున్న డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ సైనిక సరఫరాకు అవసరమైన సర్టిఫికేట్ ఇచ్చిందని, ఈ విషయాన్ని కాంగ్రెస్‌కు తెలియజేసిందని అమెరికా విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి తర్వాత భారత్–పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ సమయంలో ఆయుధాల సరఫరాకు అమెరికా ఆమోదం లభించింది. నియంత్రణ రేఖ వద్ద రెండు వైపుల నుండి నిరంతర కాల్పులు జరుగుతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఇంతలో, పాకిస్తాన్ ఎల్ఓసి దగ్గర పెద్ద ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించింది. ఈ సమయంలో అమెరికా నుండి సైనిక హార్డ్‌వేర్ సరఫరాకు అనుమతి పొందడం హాట్‌టాపిక్‌గా మారింది. ఇండో–పసిఫిక్ మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ ఫ్రేమ్‌వర్క్ కింద భారతదేశం–అమెరికా సహకారంతో 'ఫారిన్ మిలిటరీ సేల్స్' మార్గం ద్వారా సరఫరాలను ప్రతిపాదించారు. 'ఇండో–పసిఫిక్ మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్ సంబంధిత పరికరాలను భారతదేశానికి 131 మిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో విదేశీ సైనిక అమ్మకానికి ఆమోదించాలని విదేశాంగ శాఖ నిర్ణయం తీసుకుంది' అని అమెరికా రీడౌట్ తెలిపింది. సి–విజన్ డాక్యుమెంటేషన్, లాజిస్టిక్స్ ఇతర సంబంధిత అంశాలతో పాటు, "సి–విజన్ సాఫ్ట్‌వేర్," "రిమోట్ సాఫ్ట్‌వేర్" కొనుగోలుకు భారతదేశం యాక్సెస్ కోరిందని ప్రకటనలో పేర్కొంది.

# డిగ్రీ అర్హతతో యూనియన్ బ్యాంకులో కొలువులు

మొదటిపేజీ తరువాయి మొత్తం 500 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో అసిస్టెంట్ మేనేజర్ (క్రెడిట్) పోస్టులు 250, అసిస్టెంట్ మేనేజర్ (ఐటీ) 250 వరకు ఉన్నాయి. మే 20వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. పోస్టును బట్టి సంబంధిత విభాగంలో బీటెక్ లేదా బీఈ, సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏ, ఎంఎస్సీ, ఎంఈ లేదా ఎంటెక్, ఎంబీఏ లేదా పీజీడీఎం, ఎంసీఏ, పీజీడీబీఎంలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అలాగే ఏడాది పాటు పని అనుభవం కూడా ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి ఏప్రిల్ 1, 2025వ తేదీ నాటికి 30 ఏళ్లకు మించకుండా ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో మే 20, 2025వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన వారికి నెలకు రూ.48,480 నుంచి రూ.85,920 వరకు జీతంగా చెల్లిస్తారు.

**– రాత పరీక్ష ఎలా ఉంటుందంటే..**

రాత పరీక్ష మత్తం 150 ప్రశ్నలకు 225 మార్కులకు ఉంటుంది. పార్ట్ 1లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలకు 25 మార్కులు, రీజనింగ్‌లో 25 మార్కులకు 25 ప్రశ్నలు, ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్‌కు 25 మార్కులకు 25 ప్రశ్నలు.. ఇలా 75 మార్కులకు ఉంటుంది. ఇక పార్ట్ 2లో 150 మార్కులకు సంబంధిత పోస్టుకు చెందిన ప్రొఫెషనల్ నాలెడ్జ్‌లో పరీక్ష ఉంటుంది. మొత్తం 150 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. గ్రూప్ డిస్కషన్‌కు 50 మార్కులకు ఉంటుంది. ఇందులో కనీసం 25 మార్కులు తెచ్చుకోవల్సి ఉంటుంది.

# సోనియా, రాహుల్‌కు కోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి కేసు తదుపరి విచారణ మే 7వ తేదీకి వాయిదా వేసింది. అయితే ఈడీ ఇటీవల దాఖలు చేసిన ఛార్జిషీట్ విచారణ సమయంలో ప్రతివాదుల వాదనలు వింటామని ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే స్పష్టం చేశారు. కొత్త చట్ట నిబంధనల ప్రకారం నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని.. ఈ నేపథ్యంలో విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఈడీ ఇటీవల ఢిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గతవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఈడీ సమర్పించిన ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేని కారణంగా రాహుల్, సోనియా గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ చర్యలు తీసుకుంది. బిజెపి నేత సుబ్రమణ్య స్వామి జూన్ 2014లో దాఖలు చేసిన ప్రైవేట్ క్రిమినల్ ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టు స్వీకరించింది. ఆ తర్వాత ఈ కేసులో 2021లో ఈడీ దర్యాప్తు అధికారికంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే.

# కరడుకట్టిన ఉగ్రవాదులు

మొదటిపేజీ తరువాయి గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. అలాంటి వేళ.. కాశ్మీర్ లక్ష్యంగా చెలరేగుతోన్న ఉగ్రవాద సంస్థలతోపాటు అందులో కీలకంగా వ్యవహరిస్తున్న వారి పేర్లతో కూడిన జాబితాను నిఘా వర్గాలు శుక్రవారం విడుదల చేశాయి. లష్కరే తోయిబాతోపాటు జైషే మహమ్మద్ సంస్థలు కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాయని తెలిపింది. అంతేకాకుండా ఆ రాష్ట్రంలో అశాంతి, అలజడులను ఇవి ప్రేరేపిస్తున్నాయని పేర్కొన్నాయి. కాశ్మీర్ వ్యాలీతోపాటు నియంత్రణ రేఖ అవతల సైతం ఇవి అశాంతిని కలగ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలుస్తోంది.

# భక్తుల అభిప్రాయాల వాట్సాప్ ఫీడ్‌బ్యాక్



మొదటిపేజీ తరువాయి కోడ్‌లను ఏర్పాటు చేసింది. మొబైల్‌తో స్కాన్ చేస్తే వాట్సాప్‌లో టీటీడీ అభిప్రాయ సేకరణ పేజీ ఓపెన్ అవుతుందని అధికారులు వివరించారు. భక్తులు తమ పేరును నమోదు చేసి అన్నప్రసాదం, శుభ్రత, కల్యాణకట్ట, లడ్డూ ప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు మొదలైె వాటిని ఎంచుకోని అభిప్రాయం తెలిపేందుకు టెక్స్ట్ లేదా వీడియో ఫార్మాట్ ను ఎంచుకోవచ్చని తెలిపారు. సేవా ప్రమాణాన్ని ఎంచుకుని ఉత్తమం, సగటు, మరింత మెరుగుదల అవసరం, లేదా బాగాలేదు గా రేట్ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. భక్తులు తమ అభిప్రాయాన్ని గరిష్టంగా 600 అక్షరాల పరిమితిలో టైప్ చేయవచ్చని, లేదా వీడియోగా అప్‌లోడ్ చేయవచ్చని సూచించారు. అభిప్రాయం సమర్పించిన వెంటనే, మీ అభిప్రాయం విజయవంతంగా నమోదు చేయబడింది. మీ విలువైన ఫీడ్‌బ్యాక్‌కు ధన్యవాదాలు అనే ధృవీకరణ సందేశం వస్తుందని తెలిపారు. భక్తుల నుండి అందిన అభిప్రాయాలను టీటీడీ యాజమాన్యం పరిగణనలోకి తీసుకుని సేవల ప్రమాణాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

# ఏపీ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

మొదటిపేజీ తరువాయి ప్రభుత్వంతో పాటు సిట్, ముఖేష్ కుమార్ మీనాకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 13కు సుప్రీం ధర్మాసనం వాయిదా వేసింది. కాగా.. వైసీపీ హయాంలో మద్యం కుంభకోణంలో కీలక పాత్రధారి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అని సిట్ అధికారులు గుర్తించారు. విచారణకు రావాల్సిందిగా పలు మార్లు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే కసిరెడ్డి విచారణకు డుమ్మా కొట్టారు. ఈ క్రమంలో దుబాయ్ నుంచి వచ్చిన కసిరెడ్డి హైదరాబాద్‌లో ఏపీ పోలీసులు అరెస్ట్ చేసి ఏపీకి తరలించారు. అదే రోజు రెండు పర్యాయాలు అతడిని సిట్ అధికారులు విచారించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు బయటపడినట్లు తెలుస్తోంది. అలాగే ఈ కేసులో అంతకు ముందు విచారించిన వారి స్టేట్‌మెంట్లను ముందు పెట్టి మరి రాజ్‌కసిరెడ్డిని సిట్ అధికారులు విచారించారు. ఆపై కోర్టులో ప్రవేశపెట్టాగా.. 14 రోజుల పాటు రిమాండ్ విధించారు న్యాయాధికారి. దీంతో రాజ్ కసిరెడ్డిని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

మరోవైపు ఈ కేసులో లోతైన విచారణ జరగాల్సి ఉందని రాజ్ కసిరెడ్డిని 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టులో సిట్ పిటిషన్ వేయగా.. ఏడు రోజుల పాటు విచారించేందుకు కోర్టు అనుమతినిచ్చింది. రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రాజ్‌కసిరెడ్డిని విచారించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో ఈరోజు ఉదయమే రాజ్‌కసిరెడ్డిని సిట్ అధికారులు విజయవాడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకుని.. వైద్యపరీక్షల అనంతరం సిట్ కార్యాలయానికి తరలించారు. మద్యం కుంభకోణానికి సంబంధించి రాజ్ కసిరెడ్డి మరింత సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డారు సిట్ అధికారులు.

# పీవోకేలో ప్రజలకు అలర్ట్ ఆహారాన్ని నిల్వ చేసుకోవాలి

మొదటిపేజీ తరువాయి స్థానిక యంత్రాంగం సూచించింది. భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఇటీవల పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. శుక్రవారం స్థానిక అసెంబ్లీలో చౌధ్రీ అన్వర్ ఉల్ హక్ మాట్లాడుతూ, నియంత్రణ రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. "రాబోయే రెండు నెలలకు సరిపడా ఆహార ధాన్యాలు, నిత్యావసరాలను నిల్వ చేసుకోవాలని ప్రజలకు సూచించాం" అని వెల్లడించారు. అంతేకాకుండా, ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు స్థానిక ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకోసం రూ.100 కోట్లతో ఒక అత్యవసర నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆహారం, ఔషధాలు, ఇతర కనీస అవసరాల సరఫరాలో ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా చూడటమే ఈ నిధి యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన వివరించారు.

# అమరావతి కేవలం నగరం కాదు

మొదటిపేజీ తరువాయి నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 93 శాతం స్ట్రయిక్ రేట్‌తో చరిత్రాత్మక విజయం సాధించిందని చంద్రబాబు గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వెంటిలేటర్‌పై ఉందని, ప్రధాని మోదీ అండతో దానిని తిరిగి గాడిలో పెడుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైఎస్ఆర్‌సీపీ పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తీసుకొస్తున్నామని అన్నారు. అమరావతి కేవలం ఒక నగరం కాదని, అది ఐదు కోట్ల ఆంధ్రుల సెంటిమెంట్ అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. రాజధాని నిర్మాణం కోసం నాడు 29 వేల మంది రైతులు తమ భవిష్యత్తును త్యాగం చేసి 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించారని గుర్తుచేశారు. చారిత్రకంగా అమరలింగేశ్వర స్వామి, కృష్ణానది, బౌద్ధారామాలకు నిలయమైన అమరావతి అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు చెప్పలేని కష్టనష్టాలు అనుభవించారని, వారి పోరాటం, త్యాగం మరువలేనిదని అన్నారు. అమరావతి ఉద్యమం లాంటి దాన్ని తన జీవితంలో చూడలేదని కొనియాడారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పుతో అమరావతికి మళ్లీ ప్రాణం పోశారని వ్యాఖ్యానించారు.

# ధర్మ యుద్ధంలో గెలిచిన అమరావతి రైతులు

మొదటిపేజీ తరువాయి ముళ్లకంచెల మధ్య ఇబ్బందిపడ్డారు. ఇచ్చిన మాటకు కట్టుబడి.. అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు పవన్. అమరావతి రైతుల త్యాగాన్ని ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. గత ఐదేళ్లలో సుమారు 2 వేల పైచిలుకు రైతులు ప్రాణాలు కోల్పోయారన్నారు. అమరావతి రైతుల త్యాగాలను గుర్తించిన మోదీ.. అమరావతి పున: ప్రారంభానికి విచ్చేశారన్నారు. ఏపీ ప్రజల 5 కోట్ల మందికి అమరావతి జీవనాడి అన్న పవన్.. గత ప్రభుత్వంలో అమరావవతి అంటే పరాదాలు, సెక్షన్లు గుర్తుకు వచ్చేలా చేశారన్నారు. అయితే రైతులు ఈ ధర్మ యుద్ధంలో విజయం సాధించారని పవన్ కళ్యాణ్ తెలిపారు. 5 కోట్ల మంది ప్రజల తరపున రైతులు, మహిళలు, విద్యార్థులు తిన్న గాయాలు మదిలో ఉన్నాయన్నారు. అమరావతి ప్రజల త్యాగాలను మేం మర్చిపోమన్న పవన్.. మీ ఆశలకు అనుగుణంగా అమరావతి నిర్మాణం ఉంటుందన్నారు. కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో 27 మంది ప్రాణాలు కోల్పోవడం యావత్ భారతదేశాన్ని కలచివేసిందన్నారు పవన్. ఇంత ఇబ్బందుల్లో కూడా ప్రధాని ఇక్కడికి రావడం ఏపీ ప్రజల అదృష్టం అన్నారు. అమరావతి రైతుల త్యాగాలను ప్రధాని గుర్తించారన్నారు. మోదీకి భవానీ అమ్మ ధైర్యం ఇవ్వాలని కోరుకుంటున్నామని పవన్ కళ్యాణ్ అన్నారు.

# కొత్త ఆంధ్రప్రదేశ్ రూపుదాల్చుతోంది


మొదటిపేజీ తరువాయి అమరావతి నిర్మాణాలు కొనసాగేందుకు కేంద్రం సహకరిస్తుంది. ఏపీలోకి ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుంది. రాజధాని అమరావతి ఏపీ ఆశలు, వికసిత్ భారత్ ఆశలు.. స్వర్ణాంధ్రకు బీజం. ఏపీని అధునాతన రాష్ట్రంగా మార్చబోతోంది అమరావతి. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి." అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడం విశేషం.. "అమరావతి స్వప్నం సాకారమవుతున్నట్లు కనిపిస్తోంది. చారిత్రక పరంపర, ప్రగతి రెండూ కలిపి పయనిస్తున్నట్లు గోచరిస్తోంది. ఒక కొత్త అమరావతి, కొత్త ఆంధ్రప్రదేశ్. దుర్గాభవానీ కొలువైన ఈ భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. బౌద్ధ వారసత్వం, ప్రగతి కలగలిపిన ప్రాంతం ఇది. ఇప్పుడు నేను ఈ పుణ్యభూమిపై నిలబడి ఉన్నాను. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది. అని మోదీ ఆసక్తికర ప్రసంగం చేశారు.

శనివారం
03 - 05 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# అన్న క్యాంటీన్ల నిర్వహణపై అభిప్రాయం తెలుపండి

**– నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు**




మనగళం కర్నూలు : నగరంలోని అన్న కాంటీన్ల నిర్వహణపై ప్రజలు అభిప్రాయం తెలుపాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు కోరారు. శుక్రవారం పరిమళ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ప్రజలను ఆహార రుచి అడిగి తెలుసుకున్నారు. ప్రతి అన్న క్యాంటీన్ వద్ద క్యూఆర్ కోడ్ ఉంటుందని, దానిని స్కాన్ చేసి ప్రజలు తమ అభిప్రాయాలను తెలుపవచ్చని సూచించారు. వాటి ఆధారంగా అన్న క్యాంటీన్‌లను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం ఉందన్నారు.

# కిశోరి వికాసం ద్వారా బాలికల సర్వతో ముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా

మనగళం కర్నూలు : కిశోరి వికాసం ద్వారా బాలికల సర్వతో ముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కిశోరి వికాసం-వేసవి శిక్షణ కార్యక్రమాల ప్రణాళిక (మే 2వ తారీకు నుండి జూన్ 10 వరకు )పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం 'కిశోరి వికాసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు..ఈ కార్యక్రమం ద్వారా విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత వంటి 12 అంశాలపై బాలికలకు అవగాహన కల్పించనున్నారని కలెక్టర్ తెలిపారు.. బాల్య వివాహాలు జరగకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఆడపిల్లలు స్కూల్ డ్రాప్ అవుట్ లు కకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు..బాలల హక్కుల చట్టం పోస్కో గురించి పూర్తి అవగాహన కలిగించాలని కలెక్టర్ సూచించారు. ఐసీడీఎస్ తోపాటు డీఆర్డీఏ, మెప్మా, విద్య, వైద్య, పోలీసు శాఖలు, ఇంటర్ బోర్డు, ఎస్ఎస్ఏ, స్కిల్ డెవలప్మెంట్, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి నిర్మల , డి ఎం హెచ్ ఓ శాంతి కళ, డిసిపిఓ శారద , లీగల్ ఆఫీసర్ శ్రీలక్ష్మి , సామాజిక కార్యకర్త నరసింహులు మరియు కౌన్సిలర్ నాగేశ్వరరావు లు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడులు రాయలసీమపై తమ వైఖరిని స్పష్టం చేయాలి

**– కర్నూలు డెవలప్మెంట్ ఫోరం, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన**




మనగళం, కర్నూలు : దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతులమీదుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమరావతి పునర్నిర్మాణం కార్యక్రమంలో రాయలసీమపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని స్పష్టం చేయాలని కర్నూలు డెవలప్మెంట్ ఫోరం కన్వీనర్ మోహన్ కడింపల్లి, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు రాయలసీమ డిమాండ్స్ తెలుపుతూ కర్నూలు కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా మోహన్ కడింపల్లి, రాయలసీమ రవికుమార్ మాట్లాడుతూ బీజేపీ,టీడీపీ ప్రభుత్వాలు గతంలో రాయలసీమకు ఇచ్చిన రాయలసీమ డిక్లరేషన్,మిషన్ రాయలసీమ సంగతి ఏమైందో సమాధానం చెప్పాలన్నారు 1953లో ఆంధ్రప్రదేశ్ మొదటి రాజధాని కర్నూలును పాలకులు విస్మరించి %ఝ్రా% అంటే %ఝా%అంటే అమరావతి,%ళా%అంటే పోలవరం అని చెబుతున్నారని మరి మొదటి రాజధాని, కృష్ణ,తుంగభద్ర నది జలాలను త్యాగం చేసిన రాయలసీమ గతేమిటో చెప్పాలని, రాయలసీమ కరువు,వలసలు,రైతుల ఆత్మహత్యకు కారణమెవరో చెప్పాలని అమరావతి జపం చేస్తూ రాయలసీమ ప్రాంతాన్ని విస్మరించడం అన్యాయమని అన్నారు.. రాయలసీమలో శ్రీబాగ్ ఒప్పందం అమలు ప్రకారం పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలని, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని, రాయలసీమకు పన్ను మినహాయింపును ఇవ్వాలని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమకు ఇచ్చిన హామీలనన్నిటిని తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రాయలసీమ ఉద్యమకారులు సత్యనారాయణ గుప్తా,రైతు స్వరాజ్య వేదిక సభ్యులు శేఖర్ పోతుల,రాయలసీమ విద్యార్థి పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పాలకొమ్మ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మనగళం, కర్నూలు :ఉమ్మడి కర్నూలు జిల్లాలో యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు యాదవ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు కంది వరుణ్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం యాదవ చైతన్య వేదిక జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జ్యోతిష్య యాదవ్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కంది వరుణ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2024- 25 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసించి పదవ తరగతి ఫలితాల్లో 450 మార్కుల పైన సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యనభ్యసించి 800కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ ఆధార్, మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలను మే 20వ తేదీ లోగా యాదవ చైతన్య వేదిక కార్యాలయం, షాప్ నెంబర్ 224, సెకండ్ ఫ్లోర్ జగదీష్ మాల్, బిర్లా కాంపౌండ్, కర్నూలు కార్యాలయంలో అందజేయాలని కోరారు. ప్రతిభా పురస్కారాలను మే 25వ తేదీన ముత్తుకూరు గౌడప్ప, గోసాయి వెంకన్న ప్రాంగణం జిల్లా పరిషత్ సమావేశ కార్యాలయం లో అందజేయనున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిభా పురస్కారాలను అందజేసేందుకు యాదవ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ తో పాటు, వివిధ కార్పొరేషన్లకు చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన చైర్మన్లు రానున్నారని తెలిపారు. మరిన్ని వివరాలకు జ్యోతిష్య యాదవ్ 9652187025, మహేష్ యాదవ్ 9494194102, మధుయాదవ్ నందికొట్కూరు 9963323039, రమేష్ యాదవ్ 8106150744, శ్రీను యాదవ్ 89199351311, ఈశ్వర్ యాదవ్ 9493388706, శివకృష్ణ యాదవ్ 9000918712, వేణు యాదవ్ 852309780 లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని ప్రతి యాదవ సోదర, సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జోహారపురం వెంకట రాముడు యాదవ్, రమేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, గిరి యాదవ్, వెంకట రాముడు యాదవ్, ఈశ్వర్ యాదవ్, రమణ యాదవ్, వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ శ్రమ్ కార్డులపై అవగాహనా సదస్సు




మనగళం, కర్నూలు :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జి. కబర్ధి సూచనల మేరకు, బి. లీలా వెంకట శేషాద్రి, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు వారు శుక్రవారం నాడు న్యాయ సేవా సదన్ నందు ప్యారా లీగల్ వాలంటీర్లకు ఈ శ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు ప్రతి ఒక్కరికి ఈ శ్రామ్ కార్డులు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ శ్రామ్ కార్డుల వల్ల లభించే ఉపయోగాలను కార్మికులకు తెలియజేసి వారు ఈ శ్రామ్ కార్డులు పొందేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివరావు గారు వాలంటీర్లకు ఈ శ్రామ్ కార్డులు ఈ శ్రామ్ పోర్టర్ లో ఎలా నమోదు చేయాలో ప్యారా లీగల్ వాలంటీర్ లకు వివరించారు. అనంతరం జడ్జిగారు ప్యారా లీగల్ వాలంటీర్లు మరియు లేబర్ ఆఫీసర్లతో టీమ్లను ఏర్పాటు చేసారు. వీరు ప్రతి ఒక్క ఊరికి వెళ్లి ఈ శ్రామ్ కార్డులను అసంఘటిత కార్మికులకు అందేలా కృషి చేయాలని అలాగే వారి యొక్క సమస్య లను గుర్తించి వారికి తగు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయం పై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

# నంద్యాల జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధుల మంజూరు.

**– ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**




మనగళం, నంద్యాల :నంద్యాల జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శుక్రవారం అమరావతిలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడం జరుగుతుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ రూ.967 కోట్లతో నంద్యాల - యర్రగుంట్ల మధ్య రైల్వే లైన్ ఏర్పాటు, రూ. 2.25 కోట్లతో కొనసాగుతున్న 3 పార్కుల అభివృద్ధి పనులు, రూ.39.89 కోట్లతో నంద్యాల - డోన్ మధ్య రోడ్డు ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు,

అమృత్ పథకం కింద 5047 కుళాయి కనెక్షన్లు జిల్లాలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, నంద్యాల జిల్లా అభివృద్ధికి నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐ టీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ధన్యవాదములు చెప్పారు.

# రాష్ట్రానికి మోడీ, బాబులు ఏమి చేసారో చెప్పాలి

**– వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి**



మనగళం, కర్నూలు :అమరావతిలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన హాస్యాస్పదంగా ఉందన్నారు. మా చెల్లికి జరగాలి పెళ్ళి మళ్ళీ మళ్ళీ అంటూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన కొనసాగుతుందని ఎద్దేవా చేశారు. 2014 చంద్రబాబు హయాంలో పిడికెడు మట్టి ,చెంబు నీళ్లు తీసుకొచ్చిన నరేంద్ర మోడీ మరల ఇప్పుడొచ్చి ఏమి చెయ్యబోతున్నారో తెలియ చెయ్యాలన్నారు. మోడీ పర్యటనకు 6 వేల బస్సులను ఉపయోగించి ప్రజలకు ఇక్కట్లు పెట్టడం కాకుండా ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. అమరావతి భూమి కోసం కోట్ల రూపాయల ఖర్చు చేసి ప్రజలకు మొండి చూపించారన్నారు. చంద్రబాబు నాయుడు నరేంద్ర మోడీ మధ్య మారువాడి వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో నరేంద్ర మోడీ రాష్ట్ర అభివృద్ధికి అప్పులు తప్ప ఏమి ఇవ్వడం లేదన్నారు. లక్ష కోట్ల అప్పు తెచ్చి రాజధాని నిర్మాణం చేపట్టం విడ్డూరంగా ఉందన్నారు. రాజధాని అభివృద్ధి కోసం లక్ష కోట్ల ఖర్చు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ భవనాలను నిర్మాణాల పేరుతో కమీషన్ పేరు తో కోట్ల రూపాయలను గొల్లగోడుతున్నారు. నరేంద్ర మోడీ పర్యటనలో రాష్ట్రానికి ఏమి తీసుకొస్తారో బాబు చెప్పాలన్నారు. ప్రజలకు ఒంటి మీద బట్టలు లేకుండా కూటమి ప్రభుత్వం అప్పులు తీసుకొస్తుందన్నారు. రాజధాని నిర్మాణం కోసం మేము వ్యతిరేకం కాదు, లక్షల కోట్ల అప్పులు వద్దని తాము ఆరోపిస్తున్నామన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి వికేంద్రీకరణ కోసం ప్రయత్నం చేసిందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ తోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుంది, ప్రాంతాల మధ్య వివాదం ఉండకూడదని తమ ఉద్దేశమన్నారు.

# కారు ఢీకొని మహిళ మృతి



మనగళం,బండిఆత్మకూరు : మండల పరిధిలోని సంత జూటూరు గ్రామంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం కారు ఢీకొని రవనమ్మ అనే మహిళ దుర్మరణం చెందారు. బస్టాండు వద్ద రోడ్డు దాటుతున్న రవనమ్మను వేఘంగా వెళ్తున్న కారు ఢీకొనడంతో ఆమె సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. బండి ఆత్మకూరు ఎస్సై జగన్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును స్థానికులను విచారించి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందండి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మనగళం, నంద్యాల :బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణలను సద్వినియోగపరచుకొని ఉపాధి పొందాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని బీసీ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతూ ప్రాథమిక టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలందరూ చక్కగా సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలన్నారు. మహిళా సాధికారత కింద ప్రాథమిక టైలరింగ్ శిక్షణపై శిక్షణ ఇచ్చేందుకు బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ మరియు కాపు (బలిజ) మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 500 మంది లబ్ధిదారులకు శిక్షణ పూర్తి అయిన తర్వాత ప్రతి అభ్యర్థికి ఒక దర్జీ మోడల్ కుట్టుమిషన్ పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 3441 మందికి శిక్షణ శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. ఈ నేపథ్యంలో 11,105 మంది బిసిలు, 96మంది కమ్మ, 691 మంది రెడ్డి , 871మంది కాపు (బలిజ), 344 మంది ఈబీసీలు , 308 మంది ఆర్య వైశ్య, 34 మంది బ్రాహ్మణ, ఒకరు క్ష్యత్రియ కులాలకు చెందిన వారు టైలరింగ్ శిక్షణ కొరకు ధరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 25 టైలరింగ్ శిక్షణ సెంటర్ లు ప్రారంభమయ్యాయని కలెక్టర్ తెలిపారు. అన్ని కేంద్రాలలో మొత్తం 2827 మంది మహిళలు టైలరింగ్ శిక్షణ తరగతులకు హాజరవుతున్నారన్నారు. ఇందులో 2381మంది బిసిలు, 5మంది కమ్మ, 104 మంది రెడ్డి, 150 మంది కాపు (బలిజ), 122 మంది ఈబిసీలు, 58 మంది ఆర్య వైశ్య, 6మందిబ్రాహ్మణ, ఒకరు క్ష్యత్రియ కులాల వారు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. శిక్షణ పొందిన మహిళలందరూ స్వయం ఉపాధితో జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు

# వాహన విక్రయాలు అంతంతే

న్యూఢిల్లీ, మనగళం, : మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ గడిచిన నెలలో వాహన విక్రయాలు ఆశించిన స్థాయిలో నమోదయ్యాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలు మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాలు పెరగగా.. టాటా మోటర్స్, హ్యుందాయ్ సేల్స్ తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ మహీంద్రా రెండో స్థానానికి, టాటా మోటర్స్ మూడో స్థానానికి ఎగబాకింది. కానీ, రెండో స్థానంలో కొనసాగిన హ్యుందాయ్ ఈసారి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది. మారుతి అమ్మకాలు ఏడు శాతం అధికమయ్యాయి.

# నీట్ పరీక్షలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించండి

**– ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు**
**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మనగళం, నంద్యాల :దేశ వ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు (నీట్) పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్ల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. సమావేశంలో నీట్ పరీక్షల సిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈ నెల 4వ తేదీన నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు (నీట్) పరీక్షలు జిల్లాలో ప్రథమంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్ లను ఆదేశించారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలో ఉన్న గవర్నమెంట్ హై స్కూల్, టేక్కే జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తదితర కళాశాలలో 1172 మంది విద్యార్థులు నీట్ పరీక్షలకు హాజరవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షకు వచ్చే విద్యార్థులు అడ్మిట్ కార్డు, ఆధార్, పాన్, ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్ తదితర గుర్తింపు కార్డులతో పాటు పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. మ.2.గం.ల నుంచి సా.5.గం.ల వరకు ఆఫ్ లైన్ విధానంలో పరీక్ష జరగనున్నందున ఉ.11 గం.ల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. మ.1.30.గం.ల తరువాత విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రతి పరీక్షా కేంద్రంలో 2 వీల్ చైర్లను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో ఏ ఒక్క చిన్న సంఘటన కూడా జరగకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన పరీక్ష పేపర్లను పోలీసు సహకారంతో తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పట్టణంలో అభ్యర్థులకు ట్రాఫిక్ వల్ల ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసి ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో వైద్య శిబిరాలను కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో చల్లటి తాగునీరు, తగిన వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. నీట్ పరీక్షల నియమ నిబంధనలను తప్పక పాటించాలని కలెక్టర్ చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు అత్యంత ఒత్తిడితో నీట్ పరీక్షలు రాస్తున్న నేపథ్యంలో ఇన్విజిలేటర్లు విద్యార్థుల పట్ల సానుకూలతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం నీట్ పరీక్షలపై పాటించాల్సిన నియమ నిబంధనల పై జిల్లా కో-ఆర్డినేటర్ సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లకు వివరించారు.

# సంపాదకీయం

ముసాయిదా తీర్మానం నీరుగారినట్టేనా!

పహల్గాం ఉగ్రఘాతుకాన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రపంచ దేశాలకు కనువిప్పు కలిగేలా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం పాఠం ఉంటుందని భారత్ ఆశించింది. కానీ తీర్మానం ఎవరికీ ఏమాత్రం నొప్పి కలగని రీతిలో మొక్కుబడి తంతుగా ముగిసింది. " అంతర్జాతీయ శాంతిభద్రతలకు తీవ్రమైన ప్రమాదం కలిగించే బహు రూపాల్లో, వ్యక్తీకరణల్లో ఉగ్రవాదం నెలకొంది. ఉగ్రవాద మూకలను, వారిని పెంచి పోషిస్తున్న బాధ్యులను చట్టం ముందుకు తీసుకురావలసిన అవసరం ఉంది" అని తీర్మానం ప్రకటించింది. ఈ ప్రకటనలతో ఎలాంటి ఫలితం ఉండదన్న సంగతి అందరికీ తెలిసిందే. పహల్గాం దాడికి తామే బాధ్యులమని ది రెసిస్టెన్స్ ఫోర్స్ (టిఆర్ఎఫ్) మొదట్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ టిఆర్ఎఫ్ పేరు తీర్మానంలో ఎక్కడా ప్రస్తావించలేదు. అలాగే టిఆర్ఎఫ్ వంటి ఉగ్రవాద పిల్ల సంస్థలకు మూలవేరుగా పేర్కొనే లష్కర్ ఇ తొయిబాను ఉగ్రవాద సంస్థగా భద్రతా మండలి ఎప్పుడో గుర్తించింది. పహల్గాం దాడి వెనుక లష్కర్ ఇ తొయిబా ప్రేరణ ఉందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ లష్కర్ ఇ తొయిబా పేరు కానీ, దీంతో సంబంధం ఉన్న గ్రూపుల విషయం కానీ తీర్మానంలో ఎక్కడా పేర్కొనక పోవడం విశేషం. ముస్లిమేతరులను టార్గెట్ చేసుకున్న ఉగ్రవాదుల గురించి కానీ, మతపరమైన ఉద్రిక్తతలను ప్రేరేపించే లక్షం పెట్టుకున్న విద్రోహ చర్య గురించి కానీ, తీర్మానంలో రేఖామాత్రమైనా ప్రస్తావించలేదు. ఉగ్రవాద నిర్మూలన ప్రయత్నంలో గతంలో మాదిరిగా భారత ప్రభుత్వంతో అన్ని దేశాలూ సహకరించాలన్న సూచన కూడా తీర్మానంలో చోటు చేసుకోలేదు. ఇదివరకటి తీర్మానాలతో పోలిస్తే ఇప్పటి తీర్మానం భాష ముసాయిదా పూర్తిగా నీరు కారిపోయినట్టు స్పష్టమవుతోంది. రాజీ పూర్వకంగా అందరికీ ఆమోదయోగ్యమైన భాషను ఉపయోగించినట్టు తెలుస్తోంది. దీని వెనుక పాకిస్థాన్, చైనా దేశాల ప్రభావం ఉన్నట్టు చెప్పవచ్చు. భద్రతా మండలికి శాశ్వతేతర సభ్య దేశంగా ఈ ఏడాదే పాకిస్థాన్ ఎన్నికైంది. పాకిస్థాన్‌కు సర్వకాల మిత్రదేశం చైనా. పాకిస్థాన్‌ను ఇరకాటంలో పెట్టే సంక్లిష్టమైన తీర్మానాలను తీసుకురాకుండా చూడడంలో చైనా హస్తం ఉంది. గతంలో కూడా అనేకసార్లు పాకిస్థాన్ పక్షాన చైనా నిలిచిన ఉదంతాలు ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడిపై తమపై వచ్చిన ఆరోపణలపై ప్రపంచ దేశాల దృష్టిని మళ్లించేందుకు పాకిస్థాన్ ఎంతో ప్రయత్నిస్తోంది. దానికి చైనా, అమెరికా సాయం కోరుతోంది. ఈ సందర్భంలో పహల్గాం దాడిపై నిష్పాక్షిక దర్యాప్తును వేగవంతం చేయాలని పాకిస్థాన్ డిమాండ్ చేస్తోంది. దానికి చైనా వంత పాడుతోంది. అమెరికా, రష్యా, బ్రిటన్ దేశాలైనా సరే పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏ తీర్మానం తీసుకువచ్చినా ఆమోదం లోకి తీసుకురావద్దని ప్రస్తుత భద్రతా మండలి అధ్యక్షుడు , ఫ్రాన్స్ దౌత్యవేత్తకు పరోక్షంగా చైనా సంకేతాలందిస్తోంది.

ఫలితంగా భద్రతా మండలి తీర్మానం పసలేక మెత్తగా వెలువడింది. తీర్మానంలో టిఆర్ఎఫ్ పేరు లేకుండా చేయడంలో అమెరికాతో కలిసి చైనా లాబీ చేయడంలో కృతకృత్యురాలైంది. ఎలాంటి సాక్షాధారాలు లేవని టీఆర్ఎఫ్‌ను తప్పించింది. దీంతో టీఆర్ఎఫ్ తన ఇదివరకటి ప్రకటనను ఉపసంహరించుకుంది. టీఆర్ఎఫ్ పేరును తొలగించి భద్రతా మండలి తుది తీర్మానం ఖరారు చేసిన తరువాత పాకిస్థాన్ విధానపరమైన వైఖరికి అనుకూలంగా తనకు తాను మలచుకుంది. పాకిస్థాన్ సార్వభౌమత్వాన్ని , భద్రతను చైనా సమర్థిస్తుందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఝూ ప్రకటించడం ఈ సందర్భంగా గమనార్హం. పాకిస్థాన్‌లో వివిధ ప్రాజెక్టుల్లో కొన్ని వేల మంది చైనా జాతీయులు పనిచేస్తున్నారు. మిత్రదేశమైన పాకిస్థాన్‌ను ఉగ్రవాద విషయంలో తూర్పారపట్టితే పాక్‌తో వైరం కొని తెచ్చుకోవలసి వస్తుందని, పాక్ లోని చైనా జాతీయులకు రక్షణ లేకుండా పోతుందని చైనా ముందుచూపుతో వ్యవహరిస్తోంది. భద్రతా మండలి వ్యవహారం భారత్‌కు అసంతృప్తి కలిగిస్తోంది. ఉగ్రవాదాన్ని ఖండిస్తూ అత్యంత కఠినమైన పదజాలంతో తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టాలన్న ఆలోచనలో భారత్ ఉంది. పాకిస్థాన్ స్థావరంగా ఉగ్రకార్యకలాపాలు సాగిస్తున్న జైష్ ఇ మొహమ్మద్ చీఫ్ మసూద్ అజహర్ నిర్వాకాన్ని పుల్వామా దాడి తరువాత భారత్ ప్రపంచానికి చాటి చెప్పింది. పహల్గాం దాడికి బాధ్యులైన టిఆర్ఎఫ్ వంటి ఉగ్రసంస్థలను ఐక్యరాజ్యసమితి వేదికగా ప్రపంచ దేశాలకు నిరూపించాలన్న పట్టుదలతో భారత్ ఉంది. 2008 లోముంబై, 2019 లో పఠాన్‌కోట్, 2019లో పుల్వామా ఉగ్రదాడులు జరిగిన నేపథ్యంలో అలాంటి ఉగ్రదాడులకు వీలు కల్పించకుండా ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామని పాకిస్థాన్ గతంలో అనేక సార్లు భారత్‌కు ద్వైపాక్షిక చర్చలో హామీలు ఇచ్చింది. కానీ ఏవీ నెరవేర్చలేకపోయింది. భారత్‌తో దౌత్యపరమైన సంబంధాలు కూడా సరిగ్గా సాగించడం లేదు. పాకిస్థాన్ ఆర్థిక మూలాలపై వేటు వేయాలన్నది భారత్ ప్రధాన లక్షం. ఉగ్రసంస్థలకు పాకిస్థాన్ నిధులు అందిస్తోందన్న కారణం చూపించి ఫైనాన్షియల్ టాస్క్ ఫోర్స్ ముందు పాక్‌ను నిలబెట్టాలని భారత్ సిద్ధమవుతోంది. 2012 నుంచి 2015,2018 నుంచి 2022 సమయాల్లో పాకిస్థాన్‌ను గ్రే లిస్టులో ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్సు ఉంచిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ప్రపంచ వేదిక సాక్షిగా ఉగ్రవాద నిర్మూలనకు బహుముఖ ప్రయత్నాలు చేయాలని భారత్ యోచిస్తోంది. ముంబై ఉగ్రదాడుల్లో కీలక పాత్ర వహించిన ఉగ్రవాది తహావూర్ రాణాను అమెరికా నుంచి బహిష్కరింప చేసి ఏ విధంగా భారత్ తన చట్టం ముందుకు తీసుకు రాగలిగిందో అదే విధంగా పహల్గాం ఉగ్రదాడి ముష్కరులను న్యాయస్థానం ముందు నిలబెట్టగలిగితేనే పహల్గాం దాడిలో అమరులైన వారికి ఆత్మశాంతి లభిస్తుంది.

# అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణాలను తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి.

**– నందమూరి తారక రామారావు ఆశయాన్ని నెరవేర్చాలి.**
**– బొజ్జా దశరథరామిరెడ్డి**




మనగళం నంద్యాల : తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణాలను, పంట కాలవలను తక్షణమే పూర్తి చేసి మరియు రుద్రవరం, చాగలమర్రి మండలలాలలోని చెరువులకు మరమ్మత్తులు చేపట్టి ఆయకట్టు సంరక్షించాలని మరియు ప్రజలకు త్రాగు నీరు అందించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

శుక్రవారం నంద్యాల జిల్లా రుద్రవరం మండల తహశీల్దారు కార్యాలయం దగ్గర తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణాలను, పంట కాలువలను తక్షణమే చేపట్టాలని కోరుతూ తెలుగుగంగ ఆయకట్టు పరిరక్షణ సమితి ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ..

రాయలసీమలో త్రాగు, సాగునీటి కోసం 80వ దశకంలో చేపట్టిన "కరువు బండ" ఉద్యమాన్ని గౌరవించి, ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గారు రాయలసీమకు త్రాగు, సాగు నీరు ఇస్తూ తెలుగుగంగ ప్రాజెక్టును ప్రారంభించారని గుర్తుచేస్తూ.. శ్రీశైలం వెనుక 'జలాలను (బ్యాక్ వాటర్) మద్రాసు త్రాగు నీటికి తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా అందజేయడంతో పాటు 29 టీఎంసీల కృష్ణా జలాలను కర్నూలు కడప జిల్లాలలో అనేక గ్రామాలకు త్రాగు నీరు, 2.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని కల్పించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. పెన్నా జలాలను వినియోగించి నెల్లూరు జిల్లాలో 2.5 లక్షల ఎకరాల ఆయకట్టు, చిత్తూరు జిల్లాలో 0.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలన్న లక్ష్యం కూడా తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగానే చేపట్టారని తెలిపారు.

ఎన్టీఆర్ మానస పుత్రికగా పేర్కొంటున్న తెలుగంగ ప్రాజెక్టు నిర్మాణాలు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయనీ, తెలుగు గంగ ప్రాజెక్టుకు సంబంధించిన అనేక కీలకమైన నిర్మాణాలు చేపట్టడంలో, విధానాలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. దీనితో రాయలసీమకు త్రాగు, సాగు నీరు పూర్తిస్థాయిలో అందించాలన్న ఎన్టీఆర్ ఆశయాం కలగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలుగుగంగ ప్రాజెక్టు కు సంబందించిన కీలక అంశాలైన

1. శ్రీశైలం రిజర్వాయర్ కనీసం నీటిమట్టం 854 అడుగులు నిర్వహించకపోవడం.

2. వెలుగోడు రిజర్వాయర్ నీటి నిలువలు సమర్థవంతంగా వినియోగించుకొనడానికి చేపట్టవలసిన బైపాస్ కెనాల్ నిర్మాణం చేపట్టకపోవడం. (తెలుగుగంగ ప్రాజెక్టు డిజైన్ ప్రకారం శ్రీశైలం ప్రాజెక్టులో వరద సమయంలో వెలుగోడు రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిలువ చేసుకున్న నీటిని వినియోగించుకోకుండా, శ్రీశైలం రిజర్వాయర్ లో 854 అడుగులు ఉన్నంతవరకు తెలుగుగంగ పంట కాలువలకు, బ్రహ్మసాగర్ కు కృష్ణా జలాలను బైపాస్ కెనాల్ ద్వారా చేపట్టాలి. ఈ నిర్మాణాలు పూర్తి కానందున నేటి వరకు వెలుగోడు రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అయిందన్న రిపోర్టును జలవనరుల శాఖ ప్రభుత్వానికి అందజేయలేదు)

3. వెలుగోడు రిజర్వాయర్ నుండి బ్రహ్మసాగర్ కు కృష్ణా జలాలను చేర్చే మద్రాసు కాలువ నిర్మాణాలను పూర్తి సామర్థ్యంతో చేపట్టకపోవడం, నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడం.

4. డిస్ట్రిబ్యూటరీస్, కాలువల, పంట కాలువల నిర్మాణాలు పూర్తి చేయకపోవడం మరియు నిర్వహణ కూడా సక్రమంగా చేపట్టకపోవడం.

5. కాలువల ద్వారా ఆయకట్టుకు పారవలసిన నీటిని మోటర్ల ద్వారా ఎత్తిపోసుకోవలసిన పరిస్తితి ఉండటంతో ప్రతి పంట కాలంలో ఎకరాకు 20 నుండి 30 వేల రూపాయల అదనపు ఖర్చు రైతులు చేయవలసి రావడం.

6. బ్రహ్మసాగర్ ద్వారా 1.60 లక్షల ఎకరాలకు ఆయకట్టుకు కడప జిల్లాలో నీరు అందవలసి ఉంటే 30 వేల ఎకరాల ఆయకట్టుకు కూడా నీరు లభించకపోవడం. అదేవిధంగా రుద్రవరం మండలం, చాగలమర్రి మండలాలలో ఉన్న చెరువుల పరిస్థితి దమనీయంగా ఉందనీ ఈ చెరువుల కట్టలు బలహీనంగా ఉండడంతో, అధిక వర్షాలతో వరదలు సంభవిస్తే ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగుతుందన్న మనోవేదనలో ఈ ప్రాంత ప్రజలు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపధ్యంలో యన్.టి రామారావు గారి ఆశయాలను నెరవేర్చే దిశగా తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణాలను, పంట కాలవలను తక్షణమే పూర్తి చెయ్యాలిని, చెరువుల మరమ్మత్తులు తక్షణమే చేపట్టి రాయలసీమ బాసటగా నిలవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ధర్నా అనంతరం రుద్రవరం మండల తహశీల్దారు మల్లిఖార్జునరావు గారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దారు స్పందిస్తూ తెలుగుగంగ ఆయకట్టు పరిరక్షణకై రైతులు ఇచ్చిన వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అదేవిధంగా తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులకు కూడా పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.యన్.రెడ్డి, మాజీ %గ్రుజ% రామగురివిరెడ్డి, పార్థసారథి రెడ్డి,హరికృష్ణ, రామకృష్ణారెడ్డి, మహబూబ్ భాష, దేవానందరెడ్డి,పట్నం రాముడు, రవికుమార్ రెడ్డి, కొమ్మా శ్రీహరి, తిమ్మారెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, వీరబ్రహ్మానందరెడ్డి, మహేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం కుంభకోణంలో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గనకు ఆస్కార్ అవార్డు ఇవ్వాలి. రమణ

**– లిక్కర్ మాఫియాలో కోట్ల రూపాయల దోపిడి**
**– రాబోయే రోజుల్లో బుగ్గన జైలుకు పోవడం ఖాయం. తెలుగుదేశం నాయకులు రమణ**

మన గళం డోన్ మజీ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి మహా మాయదారి అని మర్రి రమణ అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో %ఎ జ%రమణ మాట్లాడుతూ ప్రపంచమంతా డిజిటల్ పేమెంట్ జరుపుతూ ఉంటే బుగ్గన మాత్రం ఆ పద్ధతికి తిలోదకాలు ఇచ్చి లిక్కర్ కుంభకోణంలో లిక్కర్ మాఫియా తో కుమ్మక్కై కోట్ల రూపాయలను స్వాహా చేశాడని మర్రి రమణ అన్నారు. సజ్జల శ్రీధర్ రెడ్డి తో పాటు బుగ్గణకు వ్యాపార సంబంధాలు కలిగి ఉండడం వలన ఏప్రిల్ 28వ తేదిన విజయవాడలో సిట్ అధికారులకి పిర్యాదు చేసినట్టు తెలిపారు. అంతేకాకుండా రుద్రాక్ష గుట్ట దగ్గర ఉన్న ప్రభుత్వ వైద్యశాల, హాస్టల్ భవనానికి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం బాధ్యతారాహిత్యమని తెలిపారు. ఆ స్థలం లో నిర్మాణాలు జరపాలంటే పట్టణ అనుమతులు తీసుకోకుండా దొర్రపల్లిగ్రామ పంచాయతీ అనుమతులు పొంది కట్టడాలను




చేపట్టడం రాజారెడ్డి అతి తెలివికి నిదర్శనం అన్నారు. ప్రజలకు టిడిపి కార్యకర్తలకు సహాయం చేసే గుణం తనదని అన్నారు. రాజకీయాలకు, శుభకార్యాలకు సంబంధం లేదని ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. భారీ కుంభకోణం చేసి కోట్ల రూపాయలను దిగమింగిన బుగ్గనరాజారెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మద్ద య్య గౌడ్ ,ఈశ్వర్, రియాజ్ భాష, లారీల భాష పాల్గొన్నారు.

# సాంస్కృతిక కార్యక్రమాలు

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (01.05,2025) శ్రీనివాస భజన బృందం, విజయవాడ వారిచే భజన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ భజన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గణపతి ప్రార్థన, లింగాష్టకం, శ్రీశైల శివమయం, శివశివ శంకరా, శంభో హరహర మహాదేవ, లింగాష్టకం, శ్రీశైలవాస, పార్వతినాథుడా, శ్రీగిరిమల్లయ్య, పాతాళగంగమ్మ, కైలాసవాసుని, ఎవరికీ ఎవరయ్య ఈశ్వరా మొదలైన పలు భక్తిగీతాలను, భజనకీర్తనలను ప్రమీలారాణి, బోసు, ఉమాదేవి, రాధిక, శైలజ, శివకుమారి, సుజాత తదితరులు ఆలాపించనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా




కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిర్వహించబడుతున్నాయి. నిత్యకళారాధన కార్యక్రమాలు

# రుద్రమూర్తికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం ఆలయ ఈశాన్య భాగంలో గల రుద్రవనములోని (రుద్రపార్కులోని) రుద్రమూర్తికి ఈ రోజు (02.05.2025) శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. ఈ రుద్రమూర్తి విగ్రహాన్ని గతంలో వైశాఖ మాసములో నెలకొల్పడం జరిగింది. ఈ కారణంగా ప్రతి సంవత్సరం వైశాఖ మాసములో ఆరుద్రా నక్షత్రం రోజున ఈ రుద్రమూర్తికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడుతున్నాయి. కాగా ఈ రోజు ఉదయం జరిగిన పూజాదికాలలో ముందుగా లోక సంక్షేమాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. ఈ సంకల్పంలో దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో తగినంత వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రకృతి వైపరీత్యాలు నివారించబడాలని, దేశంలో సుఖశాంతులు విలసిల్లాలని, అకాల మరణాలు సంభవించకుండా ఉండాలని, జనులందరికీ సుఖసంతోషాలు కలగాలని పేర్కొనబడింది. తరువాత రుద్రమూర్తికి అభిషేకం నిర్వహించబడింది. అర్చకులు రుద్రమంత్రాలను పఠిస్తుండగా శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, గందోధకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, సుగంధోదకాలతోనూ, ఆ తరువాత జలంతోనూ ఈ అభిషేకం నిర్వర్తించబడింది. అనంతరం రుద్రదేవునికి బిల్వార్చనను జరిపి పుష్పార్చన చేయబడింది. ఈ పుష్పార్చనలో వివిధ రకాల పుష్పాలు వినియోగించబడ్డాయి. రుద్రదేవుని చల్లని చూపులు ఎల్లప్పుడు కృష్ణానదిపై ప్రసరించడం వలన కృష్ణానదిలో నీరు సమృద్ధిగా ఉండి, పంటలు బాగా పండుతాయని, అదే విధంగా శ్రీశైలం ఆనకట్ట ఎల్లప్పుడూ పరిరక్షించబడుతూ ఉంటుందని పలువురు ఆధ్యాత్మికవేత్తలు సూచించడంతో ఆలయ ఈశాన్యభాగంలో కృష్ణానదికి అభిముఖంగా (రుద్రుని దృష్టి కృష్ణానదిపై పడే విధంగా) ఈ రుద్రుని విగ్రహాన్ని దేవస్థానం నెలకొల్పింది. ఈ కార్యక్రమములో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్. రమణమ్మ, సహాయ కమీషనర్ ఇ. చంద్రశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం. నరసింహారెడ్డి, అర్చకులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నంద్యాల సెంట్రల్ వేర్ హౌస్ లో రైతుల కష్టాలు వర్ణనాతీతం

**- ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని రైతుల కష్టాలు తీర్చాలని ఎస్డీపీఐ డిమాండ్**




మనగళం, నంద్యాల :నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాస్ హుస్సేన్ మాట్లాడుతూ నంద్యాల చుట్టుపక్కల ప్రాంతాల నుండి రైతులు తమ పండించిన జొన్న పంటను తీసుకొచ్చి నంద్యాల సెంట్రల్ వేర్ హౌస్ లో దింపడానికి అష్ట కష్టాలు పడుతున్నారని కనీసం రైతులకు తాగునీరు మరియు భోజన సదుపాయం కూడా లేదని ముఖ్యంగా ఇద్దరు మంత్రులు ఉన్నా నంద్యాల జిల్లాలో రైతులు ఈ విధంగా కష్టాలు పడుతున్న తీర్చే నాధుడే లేరా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు వెంటనే జోక్యం చేసుకోని రైతులకు నీరు మరియు భోజన సదుపాయాలు కల్పించాలని కోరారు. హమాలీలు తక్కువగా ఉండడంవల్ల అన్లోడింగ్ లేటుగా జరిగి నాలుగు రోజులు పడుతుందని ఏ నిమిషంలో వర్షం పడి జొన్నలు తడిసిపోతాయని రైతులు చాలా బాధ పడుతున్నారు కావున ప్రభుత్వం అధికారులు త్వరలో అన్లోడింగ్ చేయడానికి హమాలీలను కూడా ఉంచాలని రైతులకు అన్లోడింగ్ నాలుగు రోజులు పడడంతో రైతులు తీసుకొచ్చిన ట్రాక్టర్ల మరియు లారీల యొక్క బాడుగ పెరిగిపోవడం వలన రైతులు నష్టపోతున్నారని రైతులు పండించిన పంటలో సగం డబ్బులు ఈ బాడుగళ్ళకే సరిపోతుందని అందుకోసం రైతుల కష్టాలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంద్యాల అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కరీముల్లా మాట్లాడుతూ నంద్యాలలో ఖద్దరు చొక్కాల రాజకీయం ఎక్కువైందని, ఎవరైతే రాజకీయ పలుకుబడి రాజకీయ నాయకుల వాహనాలను రాత్రికి రాత్రి ముందరకు పంపిస్తున్నారని ఆ వాహనాల అన్లోడింగ్ కూడా రాత్రికి రాత్రి కే చేసేస్తున్నారని రైతులు వాపోతున్నారని కొంతమంది రాజకీయ నాయకులు చేస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకొని ఎవరు ముందు వస్తే వారు ముందుగా వెళ్ళే విధంగా కల్పించాలని ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు వెంటనే జోక్యం కలుగజేసుకుని రైతుల సమస్యలను తీర్చాలన్నారు. దేశానికి రైతే వెన్నెముక రైతే రాజు అని పేరుకే కాకుండా ఆచరణలో కూడా ఉండాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ కలాం, నంద్యాల జిల్లా కార్యదర్శి కరీముల్లా నంద్యాల అసెంబ్లీ ఉపాధ్యక్షులు మజీద్ ఖాన్, అసెంబ్లీ నాయకులు అత్తర్ హుస్సేన్ , హుస్సేన్, ముజీబ్ , జమీర్ ఖాన్, పాల్గొన్నారు.

# వైభవంగా స్వర్ణరథోత్సవం



మనగళం శ్రీశైలం : ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ రోజు (02.05.2025) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి గంగాధర మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, డోలు వాయిద్యం మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈనాటి స్వర్ణరథోత్సవంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి వి.రమణమ్మ, సహాయ కమీషనర్ ఇ. చంద్రశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం. నరసింహారెడ్డి, పర్యవేక్షకులు ఎం. మల్లికార్జున, అర్చకస్వాములు, వేదపండితులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.






# అంకాళమ్మ వారికి విశేష పూజలు

మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (02.05.2025) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మ వారికి దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీ అంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన ఢమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట ముకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అభిషేకం అర్చన ను నిర్వహించబడ్డాయి.





# ఊయల సేవ






మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (02.05.2025) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయల సేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించ బడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయల సేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# కాల్షియం లోపిస్తే కనిపించే లక్షణాలు..




మన గళం : మన శరీరానికి కాల్షియం చాలా ముఖ్యం. కాల్షియం లోపం ఎముకలను బలహీనపరుస్తుందని సాధారణంగా భావిస్తుంటాము. కాల్షియం లోపం అనేక ఇతర రకాల సమస్యలను కలిగిస్తుంది. మన శరీరం అధిక నాణ్యత, అత్యుత్తమ సాంకేతికత కలిగిన యంత్రం. శరీరంలో ఏదైనా లోపం లేదా సమస్య ఉంటే, శరీరం మనకు సంకేతాలను ఇస్తుంది. కాల్షియం లోపం ఉన్నప్పుడు కూడా మన శరీరం మనకు సంకేతాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది. ఈ సంకేతాలను లక్షణాలు అంటారు. శరీరంలో కాల్షియం లేకపోవడం వల్ల హైపోకాల్సెమియా వస్తుంది. కాల్షియం మన శరీరంలోని ఎముకల బలం, అభివృద్ధికి మాత్రమే బాధ్యత వహించదు. కాల్షియం మన శరీరంలో కండరాల సంకోచం, నాడీ వ్యవస్థ, రక్తం గడ్డకట్టడంపై కూడా పనిచేస్తుంది. శరీరంలో కాల్షియం లోపం ఉంటే, అనేక రకాల సమస్యలు వస్తాయి. ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే, తీవ్రమైన అనారోగ్యం సంభవించవచ్చు. అందుకే ప్రారంభ లక్షణాలను గుర్తించడం ద్వారా కాల్షియం లోపాన్ని తొలగించాలి. శరీరంలో కాల్షియం లోపం వల్ల తక్కువ రక్తపోటు, చేతులు, కాళ్ళు, ముఖం కండరాలలో తిమ్మిరి, చేతులు, కాళ్ళలో జలదరింపు లేదా తిమ్మిరి, మీరు బలహీనంగా లేదా అలసిపోయినట్లు అనిపించవచ్చు. అలాగే మాట్లాడటం లేదా మింగడంలో ఇబ్బంది పడవచ్చు. దీనితో పాటు, నిరాశ, ఆందోళన, చిరాకు కూడా సంభవించవచ్చు. మీరు నడవడానికి ఇబ్బందిగా అనిపించవచ్చు. దీనితో పాటు, పొడి చర్మం, క్రమరహిత హృదయ స్పందన కూడా దాని లక్షణాలు కావచ్చు. కాల్షియం లోపం ఉన్నప్పుడు ఈ లక్షణాలు ఖచ్చితంగా కనిపిస్తాయి. కొన్నిసార్లు ఒకటి, రెండు లేదా మూడు లేదా నాలుగు లక్షణాలు కనిపించవచ్చు. పైన పేర్కొన్న లక్షణాలలో ఏవైనా ఒకటి లేదా రెండు వారాల పాటు మీరు ఎదుర్కొంటుంటే, మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. శరీరంలో కాల్షియం లోపం ఉన్నప్పుడు లక్షణాలు వెంటనే కనిపించవు. లోపం కొనసాగితే లక్షణాలు బయటపడతాయి. అందుకే లక్షణాలు కనిపించినప్పుడు వైద్యుడిని సందర్శించడంలో ఆలస్యం చేయకూడదు. దీనితో పాటు, శరీరంలో కాల్షియం లోపాన్ని నివారించడానికి, పాలు, పెరుగు, కాల్షియం అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి.

## ముంజలు తినకపోతే ఎట్లాగండి..?



మన గళం: ఎండాకాలంలో లభించే తాటి ముంజలు ఆరోగ్య పరంగా అమృతమే అంటున్నారు ఆయుర్వేద నిపుణులు. శరీరాన్ని చల్లబరచడానికి, డీహైడ్రేషన్ నివారించడానికి, రోగ నిరోధక శక్తిని పెంపొందిచడానికి ముంజలు సహాయపడతాయట. విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు తాటి ముంజల ద్వారా శరీరానికి లభిస్తాయి. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను నుంచి మనకు రక్షణ కల్పిస్తాయి. భానుడి భగభగలు రోజురోజుకు పెరిగిపోతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వచ్చే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని అందరూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ కీలక సూచన చేసింది. దీంతో చాలామంది సమ్మర్ డైట్ ఫాలో అవుతున్నారు..వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ఇంట్లోనే ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. మధ్యాహ్న వేళల్లో అత్యవసరమైతే బయటకు వస్తున్నారు. ఇంట్లో చల్లటి పానీయాలు తాగుతూ రెస్ట్ తీసుకుంటున్నారు. మరోవైపు వేసవి స్పెషల్ తాటి ముంజలను జనం ఇష్టంగా తింటున్నారు. అసలే మండే ఎండాకాలం.. ఇంట్లో నుంచి బయటికి వెళ్తే ఎండ దెబ్బతో బాడీ డిహైడ్రేషన్ గురవుతుంటి. అలాంటి సమయాల్లో తాటి ముంజలు తింటే మస్త్ రిలీఫ్ ఉంటుందంటున్నారు సిద్ధిపేట జిల్లా వాసులు. హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ, పొట్లపల్లి గ్రామాల్లో భారీగా తాటి వనాలు ఉన్నాయి. మండే వేసవిలో సూర్యుని భగభగను తట్టుకునేందుకు తాటి ముంజలతో చెక్ పెడుతున్నారు ఇక్కడి స్థానికులు. చిన్నా, పెద్ద తేడా లేకుండా తాటి వనాల్లోకి వెళ్లి తాటి ముంజలను లొట్టలేసుకుంటూ తింటున్నారు. సహజ సిద్ధంగా ఈ ఎండాకాలంలో మాత్రమే దొరికే తాటి ముంజలకు భలే డిమాండ్ ఏర్పడింది. ఈ తాటి ముంజల్లో క్యాలరీలు ఎక్కువ మొత్తంలో ఉంటాయని శరీరానికి కావలసిన శక్తిని అందిస్తాయని, బాడిలో ఉన్న హీట్‌ను బాగా తగ్గిస్తుంది అంటున్నారు స్థానికులు. 100 రూపాయలకు డజన్ తాటి ముంజలను అమ్ముతూ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు ఇక్కడి గీత కార్మికులు. చాలామంది ముంజలపై గోధుమ రంగులో ఉండే పొట్టు తీసేసి తింటారు. కానీ ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయని, ఆరోగ్యానికి మంచిదని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

# ఫ్రిజ్‌లో రోజుల తరగడి బాటిల్ నీళ్లు నిల్వ చేసే అలవాటు ఉందా?



మన గళం వేసవిలో చాలా మంది ఫ్రిజ్‌లోని చల్లని నీటిని తాగడం సర్వసాధారణంగా చూస్తూనే ఉంటాం. వేడిని తగ్గించడానికి, చాలా మంది సాధారణ నీటికి బదులుగా రిఫ్రిజిరేటర్ నుంచి చల్లని నీటిని తాగడానికి ఇష్టపడతారు. కొంతమంది ఒకేసారి 5 నుంచి 8 బాటిళ్లలో నీళ్లు నింపి, వారాల తరబడి ఫ్రిజ్‌లోనే నిల్వ చేస్తుంటారు. ఈ వేసవిలో చల్లని పానియాలు తాగేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. దీంతో చాలా మంది ఫ్రిజ్‌లోని చల్లని నీటిని తాగడం సర్వసాధారణంగా చూస్తూనే ఉంటాం. వేడిని తగ్గించడానికి, చాలా మంది సాధారణ నీటికి బదులుగా రిఫ్రిజిరేటర్ నుంచి చల్లని నీటిని తాగడానికి ఇష్టపడతారు. కొంతమంది ఒకేసారి 5 నుంచి 8 బాటిళ్లలో నీళ్లు నింపి, వారాల తరబడి ఫ్రిజ్‌లోనే నిల్వ చేస్తుంటారు. గతంలో నీటిని చల్లగా ఉంచడానికి మట్టి కుండలను ఉపయోగించేవారు. కానీ ఇప్పుడు కూడా చాలా మంది వాడుతున్నప్పటికీ అధిక మంది మాత్రం ఫ్రిజ్ నుంచి నీళ్లు తాగుతున్నారు. సులభంగా చల్లగా మారుతాయని వారాల తరబడి నీటిని ఫ్రిజ్‌లో నిల్వ చేసే అలవాటు మీకూ ఉందా? తాగే నీటిని రిఫ్రిజిరేటర్‌లో ఎక్కువసేపు నిల్వ చేస్తే ఏమవుతుంది? ఇది ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో నిపుణుల మాటల్లో తెలుసుకుందాం.. ఈ రోజుల్లో చాలా మంది మట్టి కుండలలో కాకుండా ఫ్రిజ్‌లో నీటిని నిల్వ చేస్తున్నారు. తాగునీటిని ఫ్రిజ్‌లో ఎంతసేపు నిల్వ చేయవచ్చో చాలా మందికి తెలియదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, తాగునీటిని రిఫ్రిజిరేటర్‌లో 24 గంటలు మాత్రమే ఉంచాలి. 24 గంటలకు మించి నిల్వ చేయవద్దు. అంటే నీటిని మార్చాలన్నమాట. తాగునీటిని ఎక్కువసేపు రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే, ఆ నీటిలో బ్యాక్టీరియా పెరుగుతుంది. అందువల్ల బ్యాక్టీరియా కార్యకలాపాలను నివారించడానికి ప్రతి 24 గంటలకు తాగునీటిని మార్చడం మంచిది. ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని నిల్వ చేయకుండా ఉండటం కూడా మరీ మంచిది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఫ్రిజ్ నుంచి నీటిని తీసిన వెంటనే తాగకూడదు. దానిలోని చల్లని శాతం తగ్గిన తర్వాతే దానిని తాగాలి. ఆరోగ్యాంగా ఉండాలంటే ఫ్రిజ్‌లోని నీటిని తాగడానికి బదులుగా మట్టి కుండలో నిల్వ చేసిన నీటిని తాగడం మంచిది.

# వేసవిలో అధిక వేడితో తలనొప్పి వస్తుందా?



మన గళం : వేసవిలో ఎండ వేడిని తట్టుకోవడం కాస్త కష్టమే. శరీరం చాలా వేడిగా ఉంటుంది. పైగా ఒత్తిడి, అలసట కారణంగా శరీరంలో అనేక మార్పులు సంభవిస్తాయి. సూర్యకాంతి శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. దీని ప్రభావం తలపై పడుతుంది. ఫలితంగా తలనొప్పి వస్తుంది. వాతావరణం వేడిగా ఉన్నప్పుడు తలనొప్పి రావడం సహజమే. వేసవిలో వచ్చే తల నొప్పిని నివారించడానికి ఇంట్లోనే సహజ పద్ధతుల్లో కొన్ని చిట్కాలు ట్రై చేయవచ్చు. ముఖ్యంగా వేసవిలో శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో నువ్వుల నూనె చాలా సహాయపడుతుంది. ప్రతిరోజూ నువ్వుల నూనెతో తలకు సున్నితంగా మసాజ్ చేసుకోవడం వల్ల శరీరం అలసట, తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎండలో ఎక్కువ సమయం గడపడం వల్ల తలనొప్పి వస్తుంది. వీలైనంత వరకు నీడ ప్రాంతాల్లో ఉండటానికి ప్రయత్నించాలి. తలనొప్పిని నివారించడానికి తొలుత ఎండకు దూరంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. ఇది తలనొప్పిని నివారిస్తుంది. ఒకవేళ ఎండలో బయటకు వెళ్ళవలసి వస్తే, గొడుగు తీసుకెళ్లడం లేదా తలపై స్కార్ఫ్ లేదా టోపీ ధరించడం మంచిది. ఇటువంటి ముందు జాగ్రత్త చర్యలు తలనొప్పిని నివారించడంలో సహాయపడతాయి. ఈ వేసవిలో ఎండ వల్ల వచ్చే తలనొప్పికి ఇంట్లోనే ఈ కింది విధంగా చికిత్స తీసుకోండి..

తులసి, అల్లంతో తయారు చేసిన టీ తయారు చేసి తాగాలి. ఎందుకంటే ఈ టీ తలనొప్పిని తగ్గించడానికి దివ్య ఔషధంగా పనిచేస్తుంది. ఈ టీ తాగడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. ఎందుకంటే ఇది పూర్తిగా సహజమైనది.అలాగే మజ్జిగ కూడా ప్రభావ వంతంగా పనిచేస్తుంది. దీన్ని తాగడం వల్ల తలనొప్పి తగ్గుతుంది. వేసవిలో చల్లని మజ్జిగ తాగడం వల్ల శరీరం చల్లబడటమే కాకుండా దాహం కూడా తీరుతుంది. ఇది శరీరంలో నీటి నిలుపుదలని పెంచడానికి సహాయపడుతుంది. మజ్జిగ తాగడం వల్ల తలనొప్పి, అలసట తగ్గుతాయి.

తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాలు తినాలి. అవును.. మజ్జిగ, చల్లని పండ్లు, సలాడ్లు వంటి ఆహారాలు శరీరాన్ని హైడ్రేట్ చేస్తాయి. అవి శరీర ఉష్ణోగ్రతను కూడా తగ్గిస్తాయి.తగిన విశ్రాంతి అవసరం. శరీరానికి తగిన విశ్రాంతి ఇవ్వడం ద్వారా తలనొప్పిని తగ్గించుకోవచ్చు. విశ్రాంతి సమయంలో శరీరం ఉత్తేజితమై ప్రశాంతంగా ఉంటుంది. అలాంటి విశ్రాంతి తలనొప్పి తీవ్రతను తగ్గిస్తుంది. యోగా, ప్రాణాయామం చేయాలి. ఇది వెంటనే తగ్గకపోయినా, భవిష్యత్తులో తలనొప్పి రాకుండా చేస్తుంది. వ్యాయమాలు శరీరాన్ని ప్రశాంతపరుస్తాయి. రక్త ప్రసరణను మెరుగుపరచడం ద్వారా తలనొప్పిని నివారిస్తాయి. ముఖ్యంగా వేసవిలో వ్యాయామాలు చేయడం వల్ల శరీరం వేడెక్కకుండా ఉంటుంది.

# భారత్‌కు మరో నాలుగు స్వర్ణాలు



మన గళం ఆసియా అండర్-15, 17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ బాక్సర్లు సత్తా చాటారు. గురువారంతో ముగిసిన ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో నాలుగు స్వర్ణ పతకాలు జమ అయ్యాయి. ఈ నాలుగు స్వర్ణ పతకాలు బాలికల విభాగంలోనే దక్కాయి. 46కిలోల విభాగంలో ఖుషీ చంద్ 3-2పాయింట్ల తేడాతో మంగోలియాకు చెందిన అల్టానుంజుల్‌ను చిత్తుచేసి బంగారు పతకం చేజిక్కించుకుంది. 50కిలోల విభాగంలో అహనా శర్మ, 54 కిలోల విభాగంలో జన్నత్ ఉజ్బెకిస్తాన్ బాక్సర్లను 5-0పాయింట్లతో చిత్తుచేశారు. ఇక 80కిలోలకు పైబడిన విభాగంలో అషికా జోర్డాన్‌కు చెందిన జనాను ఓడించి భారత్‌కు 15వ స్వర్ణ పతకాన్ని ఖాయం చేసింది. అలాగే అండర్-17 విభాగంలో 60కిలోల విభాగంలో సిమ్రన్‌జీత్ కౌర్, 63కిలోల విభాగంలో హర్షిక ఫైనల్లో ఓడి రజత పతకాలను దక్కించుకున్నారు. చివరిరోజు భారత్‌కు నాలుగు స్వర్ణ, రెండు రజత పతకాలతో సహా మరో ఐదు కాంస్య పతకాలు దక్కాయి. దీంతో ఈ టోర్నీలో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య 43కు చేరింది. ఈ క్రమంలోనే భారత్ పతకాల పట్టికలో 2వ స్థానంలో నిలిచింది. ఇక కజకిస్తాన్ జట్టు అగ్రస్థానంతో, ఉజ్బెకిస్తాన్ జట్టు మూడో స్థానంలో ముగించాయి.

# చెత్త ఆటతో తేలిపోయిన చెన్నై



మన గళం ఐపిఎల్‌లో కళ్లు చెదిరే రికార్డు కలిగిన చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె) సీజన్ 2025లో మాత్రం చెత్త ఆటతో అభిమానులను పూర్తిగా నిరాశ పరిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి సిఎస్‌కె పేలవమైన ఆటతో తేలిపోయింది. వరుస ఓటములతో ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి ముంబై ఇండియన్స్ ఓడించి చెన్నై టైటిల్ వేటకు శ్రీకారం చుట్టింది. కానీ తర్వాతి మ్యాచుల నుంచి చెన్నై ఆట పూర్తిగా మారిపోయింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో చెత్త ప్రదర్శనతో వరుస ఓటములను చవిచూసింది. ఇతర జట్లతో పోల్చితే సిఎస్‌కె బ్యాటింగ్, బౌలింగ్ అంశాల్లో చాలా బలంగా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే బ్యాటర్లు, బౌలర్లు జట్టులో ఉన్నారు. అయినా చెన్నైకి చేదు అనుభవం తప్పలేదు. రచిన్ రవీంద్ర, రాహుల్ త్రిపాఠి, శివమ్ దూబె, రుతురాజ్ గైక్వాడ్, దీపక్ హుడా, సామ్ కరన్, మహేంద్ర సింగ్ ధోనీ, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. ఇంత మంది స్టార్లు జట్టుకు అందుబాటులో ఉన్నా ఫలితం లేకుండా పోయింది. ఆటగాళ్లు తమవంతు పాత్రను సమర్థంగా పోషించక పోవడం చెన్నై దుస్థితికి కారణమని చెప్పాలి. రచిన్ రవీంద్ర ఆరంభంలో బాగానే ఆడినా తర్వాత తేలిపోయాడు. కెప్టెన్ రుతురాజ్ గాయం వల్ల టోర్నమెంట్ నుంచి అర్ధాంతరంగా తప్పుకోవాల్సి వచ్చింది.

# రోహిత్, రికెల్టన్ అర్ధసెంచరీలు



మన గళం వరుస విజయాలతో ప్రత్యర్థి జట్లకు వణికిస్తున్న ముంబయి జట్టు జైపూర్‌లోనూ రాజస్తాన్‌పై అదరగొట్టింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, రికెల్టన్ అర్ధసెంచరీలకి తోడు.. కెప్టెన్ హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాజస్తాన్ జట్టు 16.1ఓవర్లలో 117పరుగులకే కుప్పకూలింది. బౌల్ట్, కరణ్ శర్మకు మూడేసి, బుమ్రాకు రెండు, దీపక్ చాహర్, హార్దిక్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయిని ఓపెనర్లు ఆదుకున్నారు. రికెల్టన్(61బీ 38బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్లు), రోహిత్ శర్మ(53బీ 36బంతుల్లో 9ఫోర్లు) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 116పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ జోడీని రాజస్తాన్ బౌలర్ తీక్షణ విడదీశాడు. ఆ తర్వాత కెప్టెన్ రియాన్ పరాగ్.. రోహిత్ శర్మను ఔట్ చేయడంతో ముంబయి జట్టు 123పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(48బీ 23బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు), హార్దిక్(48బీ 23బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్) మరో వికెట్ కోల్పోకుండా ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. వీరు 3వ వికెట్‌కు ఏకంగా 94పరుగులు జతచేసి ముంబయి జట్టు 200కు పైగా పరుగులు చేసేందుకు దోహదపడ్డారు. దీంతో ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 2 వికెట్ల నష్టానికి 217పరుగులు చేసింది. రాజస్తాన్ బౌలర్లు తీక్షణ, రియాన్ పరాగ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ ఛేదనలో భాగంగా రాజస్తాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రెండో బంతికి డకౌట్ కాగా.. జైస్వాల్ 13 పరుగులు చేశాడు. లోయర్ ఆర్డర్‌లో ఆర్చర్(30) మినహా మిగిలిన ఏ ఒక్క బౌలర్ రాణించలేకపోయాడు. ఈ గెలుపుతో ముంబయి జట్టు 14పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది.

# ముంబైకి వరుసగా ఆరో విజయం



మన గళం ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసు నుంచి రాజస్థాన్ రాయల్స్ కూడా వెనుదిరిగింది. గుజరాత్‌పై వారెవా.. అనే రీతిలో చెలరేగిన ఈ జట్టు తమ తర్వాతి మ్యాచ్‌లోనే పూర్తిగా చేతులెత్తేసింది. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌లోనూ విఫలమై ముంబై ఇండియన్స్ చేతిలో 100 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. దీంతో ఈ జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకొంది. అటు తొలి ఐదు మ్యాచుల్లో నాలుగింటిని కోల్పోయిన ముంబై ఇండియన్స్.. ఆ తర్వాత వరుసగా ఆరో విజయాన్ని ఖాతాలో వేసుకోవడం విశేషం. అలాగే 14 పాయింట్లతో పట్టికలో టాప్‌నకు చేరింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 2 వికెట్లకు 217 పరుగులు చేసింది. ఓపెనర్లు రికెల్టన్ (61), రోహిత్ (53) అర్ధసెంచరీలు సాధించగా సూర్యకుమార్ (48 నాటౌట్), హార్దిక్ (48 నాటౌట్) వేగం కనబర్చారు. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 16.1 ఓవర్లలో 117 పరుగులకు కుప్పకూలింది. ఆర్చర్ (30) టాప్ స్కోరర్. కర్ణ్, బౌల్ట్‌లకు మూడేసి, బుమ్రాకు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రికెల్టన్ నిలిచాడు. తమ చివరి మ్యాచ్‌లో 210 పరుగులను 15.5 ఓవర్లలోనే పూర్తి చేసిన రాజస్థాన్.. ఈసారి 217 పరుగుల ఛేదనలో అతికష్టంగా 100 పరుగులను దాటించి 16.1 పరుగులకే కుప్పకూలింది. కానీ అంతకుముందు ఈ లక్ష్య ఛేదనలో 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ పటిష్ట బౌలింగ్ లైనప్ కలిగిన ముంబైని ఎలా ఎదుర్కొంటాడోనని అంతా ఎదురుచూశారు. కానీ ఎలాంటి అద్భుతాలూ జరుగలేదు. తొలి ఓవర్‌లోనే వైభవ్‌ను పేసర్ చాహర్ డకౌట్‌గా పంపి ఆర్ఆర్‌కు షాకిచ్చాడు. ఇక రెండు సిక్సర్లతో జోరు మీదున్న జైస్వాల్ (13), రాణా (9)లను బౌల్ట్ అవుట్ చేయగా.. ఆ తర్వాత బుమ్రా వరుస బంతుల్లో పరాగ్ (16), హెట్‌మయెర్ (0)ల పనిబట్టాడు. దీంతో ఐదు ఓవర్లు కూడా పూర్తి కాకుండానే రాజస్థాన్ 47/5 స్కోరుతో నిలిచింది. అయినా పవర్‌ప్లేలో జట్టు 62 పరుగులు సాధించడం గమనార్హం. మిగిలిన ఆటగాళ్లను కూడా ముంబై బౌలర్లు చకచకా అవుట్ చేయడంతో 12 ఓవర్లలోనే 91/9 స్కోరుతో నిలిచింది. చివర్లో ఆకాశ్ (4 నాటౌట్)ను అండగా చేసుకుని ఆర్చర్ చెలరేగడంతో కనీసం వంద పరుగులైనా దాటగలిగింది. 17వ ఓవర్ తొలి బంతికి ఆర్చర్‌ను బౌల్ట్ అవుట్ చేయడంతో 23 బాల్స్ ఉండగానే ఆర్ఆర్ ఆట ముగిసింది.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310